ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది 04.02.2025 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. సమగ్ర కుటుంబ-కుల గణన సర్వే నివేదిక , ఎస్సీ వర్గీకరణ అంశాలపై చర్చించేందుకు ఈ ఉదయం మొదలైన రాష్ట్ర శాసన సభ , శాసన మండలి ప్రత్యేక సమావేశాలు మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడ్డాయి.
2. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమగ్ర కుటుంబ-కుల గణన సర్వే , ఎస్సీ వర్గీకరణ సర్వే నివేదికలపై చర్చించేందుకు అసెంబ్లీ కమిటీ హాల్ లో రాష్ట్ర మంత్రి మండలి సమావేశం కొనసాగుతోంది.
3. రాష్ట్రంలో మూడు శాసనమండలి ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ ప్రక్రియ కొనసాగుతోంది.
4. ఉత్తరాఖండ్ లో జరుగుతున్న జాతీయ క్రీడల్లో మహిళల 3x3 బాస్కెట్ బాల్ విభాగంలో తెలంగాణ జట్టు స్వర్ణ పతకం గెలుచుకుంది.

**తెలంగాణ అసెంబ్లీ వాయిదా**

కుల గణన సర్వే నివేదిక , ఎస్సీ వర్గీకరణ అంశాలపై చర్చించేందుకు రాష్ట్ర శాసన సభ , శాసన మండలి ప్రత్యేక సమావేశాలు ఈ ఉదయం మొదలైన వెంటనే వాయిదా పడ్డాయి. మంత్రి మండలి సమావేశం కొనసాగుతుండటంతో అసెంబ్లీ నోట్స్ మినిట్స్ తయారీకి కొంత సమయం పడుతుందని అప్పటి వరకు సభను వాయిదా వేయాలని అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు శాసన సభాపతిని కోరారు. మంత్రి విజ్ఞప్తి మేరకు సభను మధ్యాహ్నం 2 గంటల వరకు సభను వాయిదా వేస్తున్నట్లు సభాపతి గడ్డం ప్రసాద్ ప్రకటించారు.

**సౌండ్ బైట్ ... శ్రీధర్ బాబు**

మరోవైపు సచివాలయంలో మంత్రి మండలి సమావేశం జరుగుతుండటంతో శాసన మండలిని వాయిదా వేయాలని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ విజ్ఞప్తి చేశారు. దాంతో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కూడా సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కుల గణన సర్వే నివేదిక , ఎస్సీ వర్గీకరణ నివేదికపై చర్చించి ఆమోదించేందుకు ప్రభుత్వం ఈ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసింది.

డెస్క్

**<u>బీఆర్ఎస్-అసెంబ్లీ</u>**

శాసనసభ వాయిదా విధానంపై ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సభ ప్రారంభమైన నిమిషానికి వాయిదా వేయడం పై ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్ రెడ్డి , గంగుల కమలాకర్ ప్రశ్నించారు. శాసన సభను ఒక్క నిమిషంలోనే వాయిదా వేయడం చరిత్రలో లేదని , ఈ చర్యను బీఆర్ఎస్ శాసనసభా పక్షాన ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వానికి సభను నడపడం రావట్లేదని విమర్శించారు. అసెంబ్లీలోని మీడియా పాయింట్ వద్ద వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ ... కాంగ్రెస్ ప్రభుత్వం సభా నిబంధనలను విస్మరించి శాసనసభను అవమానించే విధంగా వ్యవహరిస్తోందని అన్నారు. అంతకుముందు బీఆర్ఎస్ ఎల్పీ, బీజెపి ఎల్పీ సభ్యులు తమ కార్యాలయాల్లో సమావేశమై శాసనసభ, మండలి ప్రత్యేక సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించాయి.

డెస్క్

**<u>అసెంబ్లీ-హరీశ్ రావు</u>**

అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన కొద్ది వ్యవధిలో వాయిదా వేయటంపై బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ప్రశ్నించారు. మంత్రి మండలి సమావేశం ఇంకా కొనసాగుతున్నదని, సబ్జెక్టు నోట్స్ సిద్ధం

చేయలేదని సభను వాయిదా వేయాలని మంత్రి శ్రీధర్ బాబు కోరడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

డెస్క్

**<u>క్యాబినెట్ మీటింగ్</u>**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్ లోని అసెంబ్లీ కమిటీ హాల్ లో రాష్ట్ర మంత్రి మండలి సమావేశం కొనసాగుతోంది. ఉదయం మొదలైన ఈ సమావేశంలో ముఖ్యమంత్రి , మంత్రులు, ఉన్నతాధికారులు సామాజిక, ఆర్థిక సర్వే నివేదిక , ఎస్సీ వర్గీకరణపై ఏక సభ్య కమిషన్ ఇచ్చిన నివేదికపై చర్చిస్తున్నారు. చర్చ అనంతరం ఈ రెండు నివేదికలకు ఆమోదం తెలిపే అవకాశం ఉంది. అనంతరం ప్రభుతవం వీటిని శాసన సభ , మండలిలో చర్చ చేపట్టనుంది.

(డెస్క్)

**<u>ఎమ్మెల్సీ నామినేషన్లు</u>**

రాష్ట్రంలో మూడు శాసనమండలి ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. నామినేషన్ల నిన్న మొదలవగా , తొలి మొదటి రోజు మొత్తం 10 నామినేషన్ పత్రాలు దాఖలయ్యాయి. మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు వేశారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఒక నామినేషన్ వచ్చింది. ప్రజావాణి పార్టీ తరఫున లింగిడి వెంకటేశ్వర్లు రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి సమక్షంలో ఒక సెట్ నామినేషన్ అందజేశారు. మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఆరు నామినేషన్లు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

డెస్క్/పిటిసి, నల్లగొండ

**కామారెడ్డి-కలెక్టర్**

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు రిసెప్షన్ , డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ఏర్పాట్లను పూర్తి చేయాలని కామారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజక వర్గాల MLC ఎన్నికల సందర్భంగా కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ , సైన్స్ కళాశాలలోని గదులను నిన్న సాయంత్రం అదనపు కలెక్టర్ విక్టర్‌తో కలిసి పరిశీలించారు.

(PTC – కామారెడ్డి)

**సిరిసిల్ల-ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు**

కాగా, ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా జరిగేలా రాజన్న సిరిసిల్ల జిల్లాలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. జిల్లాలో పట్ట భద్రులకు సంబంధించి 28 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 22 వేల 473 మంది ఓటర్లు , ఉపాధ్యాయులకు సంబంధించి 13 మండలాల పరిధిలో 928 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.

పిటిసి, రాజన్న సిరిసిల్ల

**బీఆర్ఎస్ విప్**

శాసనమండలిలో బీఆర్ఎస్ పార్టీ విప్ గా మాజీ మంత్రి , ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ను నియమిస్తూ ఆ పార్టీ అధినేత చంద్రశేఖర్ రావు నిర్ణయం తీసుకున్నారు. శాసన సభలో పార్టీ విప్ గా ఎమ్మెల్యే కేపీ వివేకానందను నియమిస్తున్నట్టు ప్రకటించారు. తమ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రావు నిర్ణయాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తారక రామారావు, ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లు సభాపతులుకు అందజేశారు.

(డెస్క్)

**సిరిసిల్ల-వస్త్రోత్పత్తి**

రాజన్న సిరిసిల్ల జిల్లా  సిరిసిల్ల పట్టణంలో చేనేత, సహకార, పొదుపు సం ఘాలకు వస్త్రోత్పత్తి అనుమతులు  వచ్చాయని చేనేత ,  జౌళిశాఖ సహాయ సంచాలకులు మిట్టకోల సాగర్ తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ శాఖలకు సంబంధించిన వస్త్రాలను ఉత్పత్తి చేసేందుకు టెస్కో అధికారులు  2025-2026  కోసం ఆదేశాలు జారీ చేశారని     తెలిపారు. మరమగ్గాల సంఖ్య ఆధారంగా వస్త్రోత్పత్తి  కి సంబంధించి ఎంవోయూ ఆర్డర్ కాపీలను పొందాలని సాగర్ కోరారు.

పిటిసి, రాజన్న సిరిసిల్ల

**పొగాకు నియంత్రణ అవగాహన**

ధూమపానం ప్రాణాలకు ముప్పు కలిగిస్తుందని , పొగాకు, ధూమపానానికి స్వస్తి పలుకుతూ ఆరోగ్యవంతమైన జీవనాన్ని ఆస్వాదించాలని పొగాకు నియంత్రణ అంతర్జాతీయ అవార్డు గ్రహీత,  పౌర సరఫరాల శాఖ ఎన్ ఫోర్స్ మెంట్ డిప్యూటీ తాసిల్దార్ మాచన రఘునందన్ అన్నారు. ఈ రోజు ప్రపంచ కాన్సర్ దినోత్సవం దినోత్సవం సందర్భంగా పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కలిగించారు.

పీఎన్

**జాతీయ క్రీడలు-తెలంగాణ**

ఉత్తరాఖండ్ లోని డెహ్రాడూన్ లో జరుగుతున్న జాతీయ క్రీడల్లో తెలంగాణ రాష్ట్రానికి తొలి స్వర్ణ పతకం లభించింది.  మహిళల 3x3  బాస్కెట్ బాల్ జట్టు ఈ పతకం గెలిచింది. ఈ ఉదయం జరిగిన ఫైనల్లో తెలంగాణ   21-11  స్కోరు తేడాతో కేరళపై విజయం సాధించింది. మరోవైపు పురుషుల 3x3  బాస్కెట్ బాల్ కాంస్య పతకం కోసం ఆడిన మ్యాచ్ లో తెలంగాణ జట్టు 16-21

స్కోరు తేడాతో తమిళనాడు జట్టు చేతిలో ఓడిపోయింది. ఫలితంగా నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది.

డెస్క్

**<u>మహిళ ఎస్ఐ మృతి</u>**

జగిత్యాల జిల్లా డీసీఆర్బీ నేర విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఎస్సై శ్వేత ఈ ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. గొల్లపల్లి మండలం చిల్వ కోడూర్ గ్రామ శివారులో శ్వేత ప్రయాణిస్తున్నకారు బైక్ ను ఢీ కొట్టి అదుపుతప్పి చెట్టుకు బలంగా ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్రవాహన దారుడు , శ్వేత సంఘటన స్థలంలో నే మృతి చెందారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం కోసం జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. ఎస్ ఐ శ్వేత మృతి పట్ల జగిత్యాల జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ అశోక్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

పీటీసీ, జగిత్యాల

**<u>జన్నారం అదనపు ఎస్సై మృతి..</u>**

మంచిర్యాల జిల్లా జన్నారం మండల అదనపు పోలీస్ సబ్ ఇన్స్ పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న రాథోడ్ తానాజీ నాయక్ గుండెపోటుతో ఈరోజు తెల్లవారుజామున మృతి చెందాడు. తానాజీ నాయక్ సొంత గ్రామం ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూరు మండలం ఏంద గ్రామం కాగా జన్నారం మండలం ఇంధన్ పల్లిలో నివాసం ఉంటున్నారు. తానాజీ మృతి పట్ల లక్షెట్టిపేట ఇన్స్ పెక్టర్ ఆఫ్ పోలీస్ నరేందర్, జన్నారం ఎస్ఐ రాజవర్ధన్ విచారం వ్యక్తం చేశారు.
పిటిసి, మంచిర్యాల

**<u>సిరిసిల్ల-ఎస్పీ</u>**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మహిళల భద్రతకు పోలీస్ అక్క , షీ టీమ్స్ విభాగాలు భరోసా కల్పిస్తున్నాయని జిల్లా సూపరింటెండెంట్ అఖిల్ మహాజన్ తెలిపారు. గత నెల రోజుల వ్యవధిలో మహిళల వేధింపులకు పాల్పడిన సంఘటనల్లో మూడు కేసులు , 8 ఈ- కేసులు నమోదయ్యాయన్నారు. జిల్లాలోని విద్యా సంస్థలలోనూ, పనిచేసే ప్రదేశాల్లోనూ అవగాహన సదస్సులు ఏర్పాటు చేశామన్నారు. వేధింపులకు గురైతే వెంటనే షీటీం లేదా పోలీస్ అక్క అనే విభాగాలైన 87126 56425కు ఫిర్యాదు చేయాలన్నారు.

పిటిసి, రాజన్న సిరిసిల్ల